పశ్చిమాన ఆగని ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైలు

- సాధారణ ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు
- అవస్థలు పడుతున్న రాయలసీమ వాసులు



మార్కాపురం: విజయవాడ-ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైలుతో విజయవాడకు త్వరగా వెళ్లవచ్చనే ప్రయాణికుల ఆశ నెరవేరడం లేదు. అధునాతన కోచ్‌లతో రైలు నడుపుతున్నామని దక్షిణ మధ్య రైల్వే అధికారులు గొప్పలు చెబుతున్నా పశ్చిమ ప్రకాశంలో మార్కాపురం-గిద్దలూరు, కంభం, దొనకొండ స్టేషన్లలో ఆగక పోవడంతో ఈ ప్రాంత వాసులకు విజయవాడ వెళ్లేందుకు ఉపయోగం లేకుండా పోతోంది. నంద్యాల, వినుకొండలో మాత్రమే స్టాపింగ్ ఏర్పాటు చేశారు. కేవలం రిజర్వేషన్ చేయించుకుంటే తప్ప ఈ రైలులో ప్రయాణించలేని పరిస్థితి ఏర్పడింది. 2016 జూలై 12న ఈ రైలును విజయవాడలో ప్రారంభించారు. రైల్వే శాఖ మంత్రి సురేష్‌ప్రభు ఢిల్లీ నుంచి వీడియో లింక్ ద్వారా ధర్మవరం-విజయవాడ ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభించినప్పుడు పశ్చిమ ప్రకాశం ప్రజలు సంతోషపడ్డారు. ప్రస్తుతం 17216 నంబర్ ధర్మవరం-విజయవాడ రైలును ప్రస్తుతం మచిలీపట్నం వరకు పొడిగించారు. విజయవాడ నుంచి ధర్మవరం వెళ్లేటప్పుడు మాత్రం మార్కాపురానికి స్టాపింగ్ ఇచ్చారు. ధర్మవరం నుంచి మచిలీపట్నం వెళ్లేటప్పుడు స్టాపింగ్ ఇవ్వలేదు. అనంతపురం, కర్నూల్, నంద్యాల తదితర ప్రాంతాల వారు శ్రీశైలం వెళ్లేందుకు మార్కాపురంలో దిగాల్సి ఉంది. ధర్మవరం ట్రైన్‌కు ఇక్కడ స్టాప్ లేకపోవడంతో ప్రయాణికులు బస్సుల్లో ఆశ్రయిస్తున్నారు. మచిలీపట్నంలో ఈ ట్రైన్ రోజూ రాత్రి 7 గంటలకు బయల్దేరి మార్కాపురానికి 10.30 గంటలకు వస్తోంది. మళ్లీ ధర్మవరంలో బయల్దేరిన రైలు అర్ధరాత్రి 1.30 గంటల మార్కాపురం వస్తోంది. ట్రైన్‌కు ఇక్కడ స్టాప్ ఉంటే ప్రయాణికులు, వ్యాపారులు, హాస్పిటల్స్‌కు వెళ్లే వారు ఉదయం 5 కల్లా విజయవాడ చేరుకుంటారు. సౌలభ్యంగా ఉంటుంది. స్టాప్ లేకపోవడంతో బస్సులకు వెళ్తున్నారు. మార్కాపురం-గిద్దలూరు ప్రాంతాల్లో వందలాది మంది సైనిక కుటుంబాలు ఉన్నాయి. మార్కాపురంలో 4 ఇంజినీరింగ్ కళాశాలలు, 2 ఫార్మసీ కళాశాలలు, బీఈడీ కళాశాలల్లో కోస్తాంధ్ర జిల్లాలకు చెందిన వందలాది మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ధర్మవరం ఎక్స్‌ప్రెస్‌కు స్టాప్ ఇస్తే రైల్వేశాఖకు అదనపు ఆదాయం వస్తోంది.

రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లా



ధర్మవరం, మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ రైలుకు మార్కాపురంలో స్టాప్ ఇవ్వాలని ఇటీవలే ఉన్నతాధికారులతో పాటు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్లా. ఇక్కడ ట్రైన్ ఆగితే చాలా మంది విజయవాడ వెళ్లేందుకు ఉపయోగంగా ఉంటుంది.
– ఆర్‌కేజే నరసింహం, డీఆర్‌యూసీసీ సభ్యుడు, గుంటూరు

క్లుప్తంగా

వ్యవసాయ ఉత్పత్తుల ధరలపై అవగాహన ఉండాలి



మిరప నాణ్యతను పరిశీలిస్తున్న ఏఓ

తాళ్లూరు: రైతులు తాము పండించిన పంటలపై ఎప్పటికప్పుడు మార్కెట్ ధరలు తెలుసుకుని తమ ఉత్పత్తులను గిట్టుబాటు ధరలకు అమ్ముకోవాలని వ్యవసాయాధికారి ప్రసాదరావు కోరారు. తాళ్లూరులో శనివారం పలు పంటల ఉత్పత్తులను ఆయన పరిశీలించారు. మిరప సాధారణ రకం క్వింటా రూ.12,600 నుంచి 17,500, ప్రత్యేక రకాలు రూ.18000 నుంచి 22,000, ప్రత్తి రూ.7200 నుంచి రూ.7,600, పసుపు రూ. 5,600 నుంచి రూ.6000 వరకు, మొక్కజొన్న రూ.1900 నుంచి రూ. రూ.2,200 వరకు, కందులు రూ.6000 నుంచి రూ.6,400 వరకు, మినుములు రూ.6,200 నుంచి రూ.6,500 వరకు ఉన్నాయని తెలిపారు. ధరలను గతం ధరలతో విశ్లేషించి అంచనా వేశామని, పంట రకం, నాణ్యత, ఎగుమతులు, దిగుమతులు, అంతర్జాతీయ ధరల ఆధారంగా హెచ్చు తగ్గులు ఉంటాయని ఏఓ చెప్పారు. వీఏఏ నాగరాజు నాయక్, వెంకటరావు, సుధీర్ పాల్గొన్నారు.

బోధనాభ్యసన కార్యక్రమాల పరిశీలన

పుల్లలచెరువు: పాఠశాలల్లో జరుగుతున్న బోధనాభ్యసన కార్యక్రమాలపై మండల మానిటరింగ్ టీం మండలంలోని పలు పాఠశాలలను శనివారం పరిశీలించారు. పుల్లలచెరువు ఎస్సీ, ఎస్టీ పాఠశాలలను తనిఖీ చేసి విద్యార్థులకు అందచేస్తున్న బోధనాభ్యసన విధానం పరిశీలించారు. ఈ సందర్భంగా టీం సభ్యులు పూర్ణయ్య, ఏడుకొండలు మాట్లాడుతూ విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠాలు నేర్పేలా గతంలో ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారని, ప్రత్యేకించి వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పాఠశాలల పరిసరాలు, మధ్యాహ్న భోజనం పరిశీలించి తగు సూచనలు చేశారు.

ఫ్లోరోసిస్ బాధితులకు రిహాబిలిటేషన్ పరికరాలు

పొదిలి: నగర పంచాయతీ పరిధిలోని ఫ్లోరోసిస్ బాధితులకు శనివారం రిహాబిలిటేషన్ పరికరాలు పంపిణీ చేశారు. జిల్లా అధికారి డాక్టర్ జి.భగీరథా దేవి, రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ ఈ.ప్రశాంతీల దృష్టికి సమస్య తీవ్రతను డాక్టర్ అనిల్‌కుమార్ తీసుకెళ్లారు. స్పందించిన అధికారులు, వైద్యులు పరికరాలు పంపిణీ చేశారు. 22 మంది బాధితులకు వీల్ చైర్లు, వాకర్స్, వాకింగ్ స్టిక్స్, బార్ బెల్టుల పంపిణీ చేశారు. తాగేందుకు సాగర్ నీటినే వాడాలని సూచించారు. క్యాల్షియం, విటమిన్ సి, మల్టీ విటమిన్ మాత్రలు వాడాలన్నారు. పాలు, గుడ్లు, ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలని వైద్యులు సూచించారు. ఉప్పలపాడు వైద్యాధికారి డాక్టర్ సుష్మ, డాక్టర్ అనిల్‌కుమార్, హెల్త్ సూపర్ వైజర్ నారు శ్రీనివాసరెడ్డి, ఏఎన్ఎంలు మాధవి, విజయ, ఆశా కార్యకర్తలు శ్యామల, పద్మ, లక్ష్మి, జీవిత పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలు పెంపొందించాలి

త్రిపురాంతకం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ కే తులసి మల్లికార్జున నాయక్ పేర్కొన్నారు. త్రిపురాంతకం మండలం ఒడ్డుపాలెం మెయిన్ ఎస్సీ, కంకణాలపల్లి ఎస్సీ పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి తరగతికి తగిన సామర్థ్యాలను పెంపొందించాలని సూచించారు.

సంక్షిప్తంగా

వాహనాలకు వేలం

గిద్దలూరు రూరల్: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో గిద్దలూరు పరిధిలో పలు కేసుల్లో పట్టుబడిన వాహనాలను శనివారం స్థానిక సెబ్ కార్యాలయం ఆవరణలో బహిరంగ వేలం పాట నిర్వహించినట్లు స్థానిక సెబ్ సీఐ అరుణకుమారి తెలిపారు. ఈ సందర్భంగా పలు కేసుల్లో పట్టుబడిన మొత్తం 11 వాహనాలకు ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బహిరంగ వేలం పాట నిర్వహించారు. వాటికి రూ.2.66 లక్షలు వచ్చినట్లు ఆమె తెలిపారు.

సహకార రంగానికి స్వర్ణయుగం

- జిల్లా సహకార అధికారి రాజశేఖర్

మార్కాపురం: ప్రస్తుతం సహకార రంగానికి స్వర్ణ యుగమని జిల్లా సహకార అధికారి పి.రాజశేఖర్ అన్నారు. శనివారం మార్కాపురం సహకార శాఖ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని సహకార సంఘాల సీఈఓలు, సిబ్బందికి వర్క్ షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ సహకార సంఘాల చట్టం 1964పై సవరణలు జరిగాయన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో కూడా నిధులు కేటాయించినట్లు పేర్కొన్నారు. పీఏసీఎస్‌లు కామన్ సర్వీస్ సెంటర్లుగా మారుతున్నాయని పేర్కొన్నారు. నేషనల్ కో ఆపరేటివ్ డేటాబేస్, కంప్యూటరీకరణ, ఆడిట్ తదితర అంశాలపై ఆయన మాట్లాడారు. పోటీ తత్వంతో సిబ్బంది పనిచేయాలన్నారు. కార్యాలయ సూపరింటెండెంట్ వీరాప్రసాద్ మాట్లాడుతూ ఈ ఓరియంటేషన్ కార్యక్రమాన్ని సిబ్బంది, సీఈఓలు ఉపయోగించుకోవాలన్నారు. డివిజన్ సూపరింటెండెంట్ బాలయ్య మాట్లాడుతూ గడిచిన రెండేళ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకార సంస్థ అభివృద్ధికి కృషి చేశాయన్నారు. పెట్రోల్ బంక్ ఏర్పాట్లకు అనువైన కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణకు సిద్ధంగా ఉండాలన్నారు.

95 పొగాకు బేళ్లు విక్రయం

పొదిలి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శనివారం 95 పొగాకు బేళ్లు విక్రయించారు. వేలంలో రైతులు మొత్తం 119 బేళ్లు ఉంచారు. పలు కారణాలతో 24 బేళ్లు తిరస్కరించారు. గరిష్ట ధర రూ.200 కాగా, కనిష్ట ధర రూ.196లుగా పలికింది. సగటు ధర రూ.199.10లుగా నిలిచింది. ఏఎస్ గిరిరాజ్‌కుమార్ వేలం నిర్వహించారు.

5న రాష్ట్ర బ్రాహ్మణ మహిళా సదస్సు

మార్కాపురం టౌన్: మార్చి 5న రాజమండ్రిలో రాష్ట్ర స్థాయి బ్రాహ్మణ మహిళా సదస్సు నిర్వహిస్తున్నట్లు బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు రెంటచింతల దీప్తి తెలిపారు. శనివారం సాయంత్రం మార్కండేశ్వర స్వామి దేవస్థానం కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. బ్రాహ్మణ మహిళలను చైతన్యపరుస్తూ రాబోయే రోజుల్లో రాజకీయంగా చైతన్య పరిచేందుకు సదస్సు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమాఖ్య ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తూ బ్రాహ్మణ మహిళలు చిన్న చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని స్వశక్తితో ఎదిగే విధంగా సహకరిస్తున్నామన్నారు. మహిళ సదస్సుకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 5 వేల మంది బ్రాహ్మణ మహిళా ప్రతినిధులు హాజరుకానున్నారని, జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సాయిలత, పురాణం దేవసేన, రెంటచింతల అపర్ణ, అన్నపూర్ణ, జాహ్నవి, రాజలక్ష్మి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికపై సమీక్ష

పొదిలి: స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ప్రచారంపై సమీక్ష సమావేశం శనివారం జరిగింది. యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సమీక్ష జరిగింది. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్, ఎస్.రవి, పొదిలి డివిజన్ యూటీఎఫ్, జన విజ్ఞాన వేదిక, పెన్షనర్ సభ్యులు పాల్గొన్నారు.

ఒకటో తేదీ నుంచి బ్రహ్మోత్సవాలు

పొదిలి: పొదిలి కొండ శ్రీలక్ష్మీ నృసింహస్వామి బ్రహ్మోత్సవాలు మార్చి ఒకటో తేదీ నుంచి 11వ తేదీ వరకు జరుగుతాయని ధర్మకర్తల మండలి చైర్మన్ కుప్పం కొల్లారావు, కార్యనిర్వహణాధికారి బి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. 1న అంకురారోపణ, 2న శేషవాహనం, 3న హంస వాహనం, 4న సింహ వాహనం, 5న హనుమంత వాహనం, 6న గరుడోత్సవం,7న కల్యాణ ఉత్సవాలు, 8న రథోత్సవం, 9న అశ్వవాహనం, 10న పూర్ణాహుతి, 11న ఏకాంత సేవ ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు. ఆయా రోజుల్లో ఉభయదాతలు ప్రత్యేక పూజలు, తీర్థ ప్రసాదాల పంపిణీ ఉంటుందని తెలిపారు.

నేడు షిర్డీ సాయిబాబా శతకం పుస్తకావిష్కరణ

మార్కాపురం: హాస్య బ్రహ్మ డాక్టర్ శంకర్ నారాయణ శ్రీ షిర్డీ సాయి బాబాపై రచించిన శతకం పుస్తకావిష్కరణ ఆదివారం సాయంత్రం 6 గంటలకు నెహ్రూ బజారులోని శ్రీ షిర్డీ సాయిబాబా మందిరంలో నిర్వహించనున్నట్లు మందిరం వ్యవస్థాపక కార్యదర్శి గోపాలుని హరిహరరావు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, పేరం సత్యనారాయణ, ఆడిటర్ నాగరాజు, ఓవీ మల్లిక్ హాజరవుతారని, సాహిత్య అభిమానులు హాజరు కావాలని కోరారు.

శ్రీవారికి విశేష పూజలు

కొనకనమిట్ల: నమో వేంకటేశాయా నమో నమః అంటూ మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వెలుగొండ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సందర్భంగా శ్రీవారికి భక్తులు నైవేద్యాలు సమర్పించి పూజలు చేశారు. శ్రీలక్ష్మీ అలివేలుమంగా వెలుగొండ వెంకటేశ్వరస్వామి వార్లను పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి, చైర్మన్ సానికొమ్ము తిరుపతిరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని మార్చి 8వ తేదీ రాత్రి శ్రీవారి కల్యాణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఉపాధ్యాయిని సుధశ్రీకి సన్మానం

పెద్దారవీడు: భారతదేశ విద్యా అమృత్ మహోత్సవ మైక్రో ఇన్నోవేటివ్ ప్రాజెక్టుల్లో భాగంగా రాష్ట్ర స్థాయిలో 12వ స్థానం సాధించిన మండలంలో దేవరాజుగట్టు ఎంపీపీ పాఠశాలలో సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయిని ఎస్ సుధశ్రీని ఎంఈఓ పీ శ్రీనివాసులు శాలువ, పూలమాలతో ఘనంగా శనివారం సన్మానించారు. ఎంఈఓ మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో మైక్రో వీడియో ప్రాజెక్టులు రూపొందించగా రాష్ట్ర స్థాయిలో 15 ఉత్తమ ప్రాజెక్టులుగా ఎంపిక చేశారు. అందులో జిల్లాలో సుధశ్రీ ఏర్పాటు చేసిన ప్రాజెక్టు 12వ స్థానం సాధించడం ఎంతో గర్వకారణమని కొనియాడారు. ప్రభుత్వం రూపొందించే ఇటువంటి కార్యక్రమాల్లో ప్రతి ఉపాధ్యాయులు భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో మండలానికి మంచి పేరు తీసుకొచ్చిన సుధశ్రీకి అభినందనలు తెలిపారు. హెచ్ఎం జీవీ కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు కాశింపీరా, ఎస్‌జే ప్రభుదాస్, రవికుమార్, ఆసియాభాను తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు చురుగ్గా ఏర్పాట్లు

పుల్లలచెరువు: ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం చురుగ్గా ఏర్పాటు చేస్తోంది. నామినేషన్ల ఘట్టం పూర్తి కావడంతో పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, సౌకర్యాలపై దృష్టి పెట్టారు. వైపాలెం నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో రెవెన్యూ యంత్రాంగం సమన్వయంతో ముందు కెళ్తోంది. ఐదు మండలాల పరిధిలో జోనల్ ఆఫీసర్లు, రూట్ ఆఫీసర్లకు శిక్షణ ఇచ్చారు. అలాగే పోలింగ్ కేంద్రాలకు సిబ్బందిని గుర్తించే ప్రక్రియ కూడా మొదలైంది. అన్ని పార్టీలు ఎంఎల్‌సీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో అభ్యర్థులు ప్రచారం ప్రారంభించారు.

మండలం	పట్టభద్రులు		మొత్తం	ఉపాధ్యాయులు		మొత్తం
	పు	స్త్రీ		పు	స్త్రీ	
వైపాలెం	1091	307	1398	41	22	63
పుల్లలచెరువు	565	123	688	22	3	25
త్రిపురాంతకం	734	227	961	41	26	67
దోర్నాల	697	278	975	68	34	102
పెద్దారవీడు	709	156	865	15	5	20
మొత్తం	3796	1091	4887	187	90	277

ఎమ్మెల్సీ అభ్యర్థిగా రవీంద్రనాథ్ ఎంపికపై హర్షం

మార్కాపురం: వైఎస్సార్ సీపీ తరఫున ఎమ్మెల్యేల కోటా కింద ఎమ్మెల్సీ అభ్యర్థిగా రాష్ట్ర ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ నుంచి వంకా రవీంద్రనాథ్‌ను ఎంపిక చేయడంపై కార్పొరేషన్ డైరెక్టర్ మేడ వెంకటబద్రీనాథ్ శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేస్తున్న రవీంద్రనాథ్‌ను ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపిక చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యావాదాలు తెలిపారు.

వినియోగదారులకు మంచి సేవలు అందించాలి




పెట్రోల్ బంక్ ప్రారంభంలో మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, ఎమ్మెల్యేలు కేపీ నాగార్జునరెడ్డి, అన్నా రాంబాబు

మార్కాపురం: వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించాలని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ డిపో ఎదురుగా మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ నూతనంగా ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్‌ను ఎమ్మెల్యేలు కేపీ నాగార్జునరెడ్డి, అన్నా రాంబాబులతో కలిసి ఆయన శనివారం ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్, మార్కెట్ యార్డు చైర్మన్ గుంటక శ్రీనివాసరెడ్డి, మార్కాపురం, తర్లుపాడు ఎంపీపీలు అరుణ చెంచిరెడ్డి, భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, పి.సూర్యప్రకాశ్‌రెడ్డి, ఆర్.శ్రీనివాసరావు, హర్ష, వర్ధన్, మహేశ్వరరెడ్డి, వంది వెంకటరెడ్డి పాల్గొన్నారు.

భక్తులకు అన్ని వసతులు కల్పించాలి

- ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు

రాచర్ల: ప్రతి శనివారం నెమలిగుండ్లరంగ నాయకస్వామి దర్శనం కోసం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా అన్ని వసతులు కల్పించాలని ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు అన్నారు. మండలంలోని జేపీ చెరువు సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన నెమలిగుండ్ల రంగనాయకస్వామి ఆలయంలో శనివారం పర్యటించారు. తొలుత స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రసిద్ధి చెందిన నెమలిగుండ్ల రంగనాయకస్వామి దర్శనం కోసం ప్రతి శనివారం వేలాది మంది భక్తులు వస్తుంటారని..భక్తులను దృష్టిలో పెట్టుకుని వసతులు కల్పించాలని దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఈదుల చెన్నకేశవరెడ్డికి తెలియజేశారు. కార్యక్రమంలో గిద్దలూరు డీఎఫ్‌వో వెంకట నరసింహారావు, ఫారెస్ట్ ఎఫ్ఆర్‌వో జీవన్‌కుమార్, దేవస్థానం చైర్మన్ కన్నసాని ఓబులేసు, చినగానిపల్లె సర్పంచ్ పగడాల రమేష్, వైఎస్సార్ సీపీ నాయకుడు సూర పాండురంగారెడ్డి పాల్గొన్నారు.

దివ్యాంగుల అభ్యున్నతికి కృషి



మంత్రి సురేష్, ఎమ్మెల్యే కేపీతో గోపాల్‌రెడ్డి

మార్కాపురం: తనపై నమ్మకం ఉంచి వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడిగా నియమించారని, ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, మంత్రి సురేష్, పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటరెడ్డిల సహకారంతో దివ్యాంగుల అభ్యున్నతికి కృషి చేస్తానని దొంతిరెడ్డి గోపాల్‌రెడ్డి అన్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఆయన్ను నియమించిన సందర్భంగా శనివారం ఆయన వారిని కలిసి సన్మానించారు. దివ్యాంగుల అభ్యున్నతికి ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, ప్రోత్సాహకాలు వివరిస్తానని చెప్పారు. అనంతరం వారిని సన్మానించారు.

12 మందికి ఉద్యోగాలు



ఉద్యోగాలు సాధించిన వారితో షంషేర్ అలీబేగ్, ప్రిన్సిపాల్

మార్కాపురం టౌన్: క్యాంపస్ సెలక్షన్స్‌లో 12 మంది విద్యార్థులకు ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగాలు రావడం అభినందనీయమని ఏ-1 గ్లోబల్ కళాశాల చైర్మన్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ మీర్జా షంషేర్ అలీబేగ్ అన్నారు. శనివారం కళాశాలలో జరిగిన క్యాంపస్ సెలక్షన్స్‌లో ఉద్యోగాలు సాధించిన వారిని అభినందించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శ్రీధర్, కంపెనీ ప్రతినిధులు గురుప్రసాద్, అశ్విని, భార్గవి పాల్గొన్నారు.

రంగస్వామి ఆలయంలో బహిరంగ వేలం



వేలంపాట నిర్వహిస్తున్న ఈఓ చెన్నకేశవరెడ్డి

రాచర్ల: మండలంలోని జేపీ చెరువు సమీపంలోని నెమలిగుండ్ల రంగనాయకస్వామి దేవస్థానం సమీపంలోని లక్ష్మమ్మ వనంలోని కల్యాణ మండపంలో వివిధ షాపులు నిర్వహించుకోనేందుకు శనివారం దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఈదుల చెన్నకేశవరెడ్డి, చైర్మన్ కన్నసాని ఓబులేసు ఆధ్వర్యంలో బహిరంగ వేలంపాట నిర్వహించారు. తలనీలాలు పోగు చేసుకోనేందుకు, కూల్‌డ్రింక్స్ అమ్ముకునేందుకు పాటదారులు ఎవరు ఆసక్తి చూపక పోవడంతో రద్దు చేయాగా టెంకాయలు అమ్ముకొను హక్కు కోసం రూ.7.45 లక్షలు, కొబ్బరి చిప్పలు పోగు చేసుకుకునేందుకు రూ.1.81 లక్షలు, గాజులు, బొమ్మలు అమ్ముకునేందుకు రూ. 45 వేలు ఎం.శివరామకృష్ణ వేలం పాటల్లో షాపులు దక్కించుకున్నారు. కాఫీ, టీ, టిఫిన్ అమ్ముకునేందుకు రూ. 2.50 లక్షలతో తులసయ్య, క్యాసెట్లు, ఫొటోలు అమ్ముకోనేందుకు రూ.1.76 లక్షలకు బాలాజీ సింగ్ అనే వ్యక్తులు వేలంపాటలో షాపులు దక్కించుకున్నారు. వాయిదా పడిన షాపులకు వచ్చే శనివారం మళ్లీ బహిరంగ వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి తెలిపారు.

వైభవంగా లక్ష్మీనారాయణ స్వామి కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

మార్కాపురం టౌన్: పట్టణంలోని శ్రీదేవి, భూదేవి సమేత ఆమలక లక్ష్మీ నారాయణ దేవాలయంలో 60వ సప్తాహ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం 8 గంటలకు అగ్ని ప్రతిష్ఠ, 9 గంటలకు ధ్వజారోహణం నిర్వహించి గరుడ ప్రసాదాన్ని పంపిణీ చేశారు. అనంతరం సప్తాహ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం 10 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనారాయణ కల్యాణం శాస్త్రోక్తంగా అర్చకులు రఘునాథాచార్యుల బృందం ఘనంగా నిర్వహించింది. భక్తులకు అన్నప్రసాదం డాక్టర్ దుగ్గెంపుడి కృష్ణారెడ్డి, గొళ్ల వాసుదేవరావు, ఏర్వ నారాయణరెడ్డిలు పంపిణీ చేశారు. భక్తులు కల్యాణాన్ని తిలకించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు డీపీ కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి పి.చెంచయ్య, కోశాధికారి వై.వెంకటరెడ్డి, కమిటీ సభ్యులు, మహిళ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

నిషేధిత వస్తువులు విక్రయిస్తే చర్యలు తప్పవు

కంభం: నిషేధిత గుట్కాలు, గంజాయి, ఇతర మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని స్థానిక ఎస్ఐ నాగమల్లేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. మండల పరిధిలో నిషేధిత పదార్థాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు. సైబర్ నేరగాళ్లు ఎస్‌బీఐ యోనో యాప్ వినియోగదారులను టార్గెట్ చేసుకొని మోసాలకు పాల్పడుతున్నారని, వినియోగదారులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మెసేజ్‌లు, ఫోన్‌కాల్స్ చేసి వివరాలు అడిగితే ఎటువంటి సమాచారం ఇవ్వకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. సైబర్ నేరాలపై ఫిర్యాదు చేయాలంటే 1930 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.